రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు.. భయాన్ని సృష్టించవద్దని బీజేపీ హెచ్చరిక 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com



## రిపోర్టర్లు కావలెను
నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 63 | జూన్ 4 గురువారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 63 | PAGES:4 | THURSDAY JUNE 4 2026 | Rs. 4:00


# చంచల్‌గూడ జైలులో కేటీఆర్ భేటీ!

## బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్




- సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు
- చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్
- కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి
- సింగరేణి కేసులో బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

కేసుల మధ్యలో సింగరేణి వివాదం రాజకీయ దుమారం రేపుతోంది!

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

అసలు కేసు నేపథ్యం ఏంటి?

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.



# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం.. స్తంభించిన ట్రాఫిక్

- మైత్రివనం ప్రాంతంలో అగ్నిప్రమాదం
- తొలుత ఆటబొమ్మల దుకాణంలో మంటలు
- క్రమంగా కేఎస్ఆర్ కాంప్లెక్స్‌కు వ్యాప్తి
- ఎలాంటి ప్రాణనష్టం లేదని పోలీసుల వెల్లడి
- పొగ కమ్మేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో (మిగతా 2వ పేజీలో..)



# తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

- తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్తంభించిన జనజీవనం
- కరీంనగర్, సిద్దిపేట, జనగామ, ములుగు జిల్లాల్లో వర్ష ప్రభావం



## చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే సమావేశం... హాజరైన పవన్ కళ్యాణ్, మాధవ్



- ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం
- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయాలపై వేడుకలకు సన్నాహాలు
- కార్యక్రమాల కార్యాచరణపై నేతల మధ్య కీలక చర్చ

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై భాగస్వామ్య పక్షాల నేతలు దృష్టి సారించారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కీలక నేతలు సమావేశమై దీనిపై చర్చించారు. ఈ భేటీలో

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.. ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

- డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం
- 2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన
- ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు
- గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు
- ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం.. స్తంభించిన ట్రాఫిక్

**(మొదటి పేజీ తరువాయి)**

మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే.మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.

# తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణలోని పలు జిల్లాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన కారణంగా అనేక చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు పట్టణాలు, గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, కరీంనగర్ పట్టణం, హుజూరాబాద్, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలతో పాటు ములుగు జిల్లాలోని మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల రోడ్లు వాగులను తలపించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

## చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీయే సమావేశం... హాజరైన పవన్ కల్యాణ్, మాధవ్

**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై నేతలు ప్రధానంగా చర్చించారు. వేడుకల నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ, భవిష్యత్ ప్రణాళికలపై సుదీర్ఘంగా సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు ఉండాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంతో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నేతలు నిర్ణయించినట్టు సమాచారం.

# భూముల విలువ పెంపు: రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

**తెలంగాణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ**

**భూముల మార్కెట్ విలువలు, ఛార్జీల పెంపు నేపథ్యంలో జనం పరుగులు**

**రద్దీని దృష్టిలో ఉంచుకొని పనివేళలు పొడిగించిన ప్రభుత్వం**

**రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అనుమతి**



తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.. ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

**(మొదటి పేజీ తరువాయి)**

ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి.ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం. నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు.. భయాన్ని సృష్టించవద్దని బీజేపీ హెచ్చరిక

**దేశంలో ఆర్థిక సునామీ తప్పదని రాహుల్ గాంధీ హెచ్చరిక**

**ఇది కేవలం భయాన్ని సృష్టించడమేనని తిప్పికొట్టిన బీజేపీ**

**దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని పలు గణాంకాలు విడుదల**

**ఎమర్జెన్సీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ గత చరిత్రను గుర్తుచేసిన నేతలు**



దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని, ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేసింది.బుధవారం కాంగ్రెస్ గిరిజన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరించారు. గతంలో ఆర్థిక ఒత్తిళ్ల నుంచి దేశాన్ని కాపాడిన వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.రాహుల్ ఆరోపణలపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు తప్పు మాత్రమే కాదు, ఇది కచ్చితంగా భయాన్ని వ్యాప్తి చేయడమేనని విమర్శించారు. గత దశాబ్ద కాలంలో ఆర్థిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేశామని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన అమ్మకాలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, భారీ విదేశీ మారక నిల్వలు వంటివి ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. సునామీ 2013లో వచ్చిందని, ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ ఈ దేశంలో వినాశనాన్ని సృష్టిస్తే, బీజేపీ దృఢంగా ముందుకు సాగుతోందని అన్నారు. కేంద్రమంత్రి, జేడీ(యూ) నేత లలన్ సింగ్ స్పందిస్తూ, రాహుల్ గాంధీకి ఆయన నాయనమ్మ ఇందిరా గాంధీ విధించిన 1975 ఎమర్జెన్సీని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. రాహుల్ పదేపదే ఇలాంటి హెచ్చరికలు చేస్తూ అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని పలువురు బీజేపీ నాయకులు విమర్శించారు.

# మమతకు భారీ షాక్: బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

**టీఎంసీలో తీవ్రరూపం దాల్చిన సంక్షోభం**

**ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు**

**బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు**

**మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై అసంతృప్తితోనే తిరుగుబాటు**

**బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ**

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు.ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది నిజమైతే, పార్లమెంటులో మమతా బెనర్జీ బలం మరింత క్షీణిస్తుంది. ఇటీవల మమత నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కేవలం ఆరుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరుకావడం ఆమె చుట్టూ విధేయుల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ తిరుగుబాటు నేపథ్యంలో టీఎంసీ బెంగాల్‌లోని అన్ని కమిటీలను రద్దు చేసి, ఆత్మపరిశీలన చేసుకుంటామని ప్రకటించింది.



# టియుడబ్ల్యూజే నల్లగొండ డివిజన్ కమిటీ ఎన్నిక





**- అధ్యక్షుడు గా వంగాల శ్రీనివాసరెడ్డి**

**నల్గొండ జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**

జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన టియుడబ్ల్యూ జే (ఐజెయు) జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షుడు, గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి పులిమామిడి మహేందర్రెడ్డి, ల సమక్షంలో నల్లగొండ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లగొండ డివిజన్ టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా వంగాల శ్రీనివాస్ రెడ్డి (సాక్షి), కత్తుల యాదగిరి (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా ఉయ్యాల లింగయ్య (ఆంధ్రప్రభ), చింత యాదగిరి (లోకల్ గైడ్ తెలంగాణ), తల్లమల దశరథ (ప్రజాపక్షం) సహాయ కార్యదర్శులుగా సయ్యద్ (మనం), కట్ట సుధాకర్ (ఈనాడు), కోశాధికారిగా సోమచంద్రశేఖర్ (మనసాక్షి), ల తో పాటు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంఘ పటిష్టత తో పాటు జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర కమిటీ సూచనల మేరకు పోరాడుతామన్నారు, అలాగే జర్నలిస్టుల ఐక్యత కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పని చేస్తామన్నారు.

# డాక్టర్స్ సెల్ఫీ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించిన





**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్గొండ జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**

టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ వందరోజుల కార్యక్రమం లో భాగంగా 4/5/2026 ఈరోజున జిల్లా క్షయ నివారణ కేంద్రం, నల్లగొండ గైనకాలజిస్ట్ అసోసియేషన్ సంయుక్తంగారూపొందించిన టిబి అవగాహన పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్, కార్యక్రమంలో జిల్లా గైనకాలజిస్ట్ డాక్టర్స్ స్వచ్ఛందంగా పాల్గొనడం, పోస్టల్ రూపొందించడం అభినందనీయం అన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో, ఎంపిక చేసిన , స్లమ్స్, వల్నరబుల్ , పని ప్రాంతాలలో ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఉచిత ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహించడం జరుకుతుందని తెలిపారు ఈ క్యాంప్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా దయాబెటిక్, హైపర్ టెన్షన్,జ్వరం, దగ్గు, ఇతర వ్యాధులు కలిగిన ప్రతిఒక్కరు చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ చేయించుకోవాలని ఆయన కోరారు ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ టెక్నాలజీ తో 10 నిమిషాలలో ఎక్స్ రే పరీక్ష పూర్తవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంతకుమారి డాక్టర్ రాజేశ్వరి డాక్టర్ విశ్వ జ్యోతి డాక్టర్ లీలావతి డాక్టర్ సంస్కృతి జిల్లా గైనకాలజిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏఎంఆర్పీ హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**కనగల్ రూరల్ జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**

ఏఎంఆర్పీ హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనుల అమలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కనగల్ మండలం, రేగట్ట వద్ద ఏఎంఆర్పి కెనాల్ లైనింగ్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కంపల్లి నుంచి మూసీ వరకు సుమారు 67 కిలోమీటర్ల మేర కెనాల్ లైనింగ్ పనులు చేపట్టడం జరుగుతున్నదని, ప్రాజెక్టు పనులను నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్ కు కలెక్టర్కు వివరించారు. పనుల కారణంగా కొంతకాలం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులతో ముందస్తుగా అవగాహన సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గ్రామాల వారీగా సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు తలెత్తకుండా లైనింగ్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెహ్రూ నాయక్, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జితేందర్ ,డి ఈ సంపత్,ఏఈలు సంబంధిత అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు .

# పవన్ ఏపీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

## తెలంగాణలో విద్వేషాలు వద్దు..

**ధాన్యం సేకరణకు కేంద్రం సహకరించడం లేదు..**

**విలేకరుల తోటి చిట్‌చాట్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి..**

**నల్గొండ జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి :**




తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సభ నిర్వహించడం సరైన సమయం కాదని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ, సమకాలీన అంశాలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

**గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడిన ముఖ్యాంశాలు..**

అమరావతిలోనే పాలకుల నివాసాలు ఉండాలి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు చెబుతున్నారని గుత్తా గుర్తుచేశారు. అలాంటప్పుడు ఏపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులంతా అమరావతిలోనే నివాసం ఉంటూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు వనరులు (సోర్సెస్) చాలా ఎక్కువ ఉన్నాయని, సుదీర్ఘ సముద్ర తీరంతో పాటు రకరకాల పోర్టులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీ నేతలు తమ రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదన్నారు.

**బాధ్యతాయుతమైన భాష ముఖ్యం..**

రాజకీయాల్లో నాయకులు వాడుతున్న భాషా తీరుపై గుత్తా అసంతృప్తి వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్న భాషా శైలి సరిగా లేదని, నాయకులు పరస్పరం దూషణలకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని హితవు పలికారు. తెలంగాణ సమాజంలో విద్వేషాలు రేకెత్తించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలు, ధాన్యం సేకరణపై మండలి చైర్మన్ సుదీర్ఘంగా మాట్లాడారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన వెల్లడించారు. అయితే ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో సహకరించడం లేదని, అందువల్లే ప్రక్రియలో కొంత ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు.

**రైతులు పంట మార్పిడి వైపు ఆలోచించాలి..**

మన రాష్ట్రంలో రైతులు కేవలం వరి, పత్తి పంటల వైపే మొగ్గు చూపుతున్నారు. ఒకే రకమైన పంటలు కాకుండా, రైతాంగం ఇకనైనా పంట మార్పిడి (క్రాప్ డైవర్సిఫికేషన్) వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## నార్కట్‌పల్లిలో ధాన్యం కొనుగోలుపై సమీక్ష: రైతులకు ఇబ్బంది ఉండొద్దు - ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్ పట్టణం జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి:**



నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.కావాల్సిన లారీలు, హమాలీల అందుబాటు, ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.

# ధాన్యం రవాణాను మరింత వేగవంతం చేయాలి..

**కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి: జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా!**

**బిజనగామ జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్నందున అధికారులు పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గురువారం నాడు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం గారితో కలిసి ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో (30,164) మంది రైతుల వద్ద నుంచి (1,91,775.700) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే (1,83,606.080) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా మిల్లులకు తరలించడం జరిగిందని వివరించారు. అలాగే (29,317) మంది రైతుల ఖాతాల్లోకి రూ. 348.99 కోట్ల నిధులను జమ చేశామని, కొనుగోలు చేసిన ధాన్యంలో (1,51,739) మెట్రిక్ టన్నుల వివరాలను ఓపీఎంఎస్ (ఖ్రామీ) పోర్టల్‌లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

ఆ 9 కేంద్రాలకు అదనపు వాహనాలు:

జిల్లాలోని మిల్లులు, కొనుగోలు కేంద్రాల వారీగా వివరాలను క్షుణ్ణంగా సమీక్షించిన కలెక్టర్.. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెండింగ్ స్థితిపై ఆరా తీశారు. ముఖ్యంగా ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉన్న లివెల్దండ, వడ్లకొండ, అశ్వారావుపల్లి, రామన్నగూడెం, ఏడునూతుల, పాకాల, చిల్పూర్, నష్కల్, రాజవరం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను, ట్రాక్టర్లను పంపించి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన లారీలు, ట్రాక్టర్లను వెనువెంటనే అన్‌లోడ్ (దిగుమతి) చేయించి, ఆ వాహనాలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్రాలలో గన్ని సంచులను సరిపడా అందుబాటులో ఉంచాలని, రవాణా, గోదాముల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా తొలి విడత వార్డు సభలు





### 12 డివిజన్లలో ప్రత్యేక వార్డు సభలు -- ప్రజలు భాగస్వాములు కావాలి : మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర

**నల్గొండ పట్టణం జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నేడు (04.06.2026) నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తొలి విడతగా 12 డివిజన్లలో ప్రత్యేక వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. శరత్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ డివిజన్ నెం. 01, 02 మరియు 03లలో నిర్వహించిన వార్డు సభలకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని 48 డివిజన్లలో నాలుగు విడతలుగా వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 04.06.2026న 12 డివిజన్లు, 06.06.2026న 12 డివిజన్లు, 08.06.2026న 12 డివిజన్లు మరియు 10.06.2026న 12 డివిజన్లలోని ప్రత్యేక వార్డు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు సభల ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, స్థానిక సమస్యలను గుర్తించడం, ప్రజల సూచనలు స్వీకరించడం మరియు పౌర సేవలను మరింత మెరుగుపరచడమేనని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్--2026లి గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త మరియు ప్రత్యేక సంరక్షణ చెత్తలిగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని



డ్రైనేజీలలో చెత్త వేయకూడదని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలకు సహకరించాలని ప్రజలకు సూచించారు. అలాగే తాగునీటిని మరిగించి తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వార్డు సభలలో ప్రజల నుండి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారులు, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై వినతులు, సూచనలు స్వీకరించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నగర ప్రజలందరూ తమ డివిజన్లలో నిర్వహించే వార్డు సభలకు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న అవగాహన సందేశాలను ఇంటింటికీ చేరవేయడంలో భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్లను

### ఆవిష్కరించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**





99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్లను మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ ఆవిష్కరించారు. ఈ పర్యావరణ అవగాహన పోస్టర్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు, అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026 ప్రకారం నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడం (సెగ్రిగేషన్) కోసం రంగుల వారీగా నిర్దేశించిన డస్ట్‌బిన్ల వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించే సందేశాలు పొందుపరచబడ్డాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాలను విస్తృతంగా ప్రజలకు చేరవేసే ఉద్దేశంతో, ఈ పోస్టర్లను కలెక్టరేట్‌తో పాటు జిల్లా పరిధిలోని అన్ని స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాభావం పెంపొందించి, స్వచ్ఛమైన, హరితమైన మరియు స్థిరమైన పర్యావరణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ జిల్లా పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్ మరియు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ జి. లింగయ్య పాల్గొన్నారు.

# FSS యాప్ ద్వారా ఎరువుల విక్రయాలపై డీలర్లకు శిక్షణ

**శామీర్పేట్ పట్టణం జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**



నేడు శామీర్పేట్ మండలం అలియాబాద్ రైతువేదిక లో మండల ఎరువుల డీలర్ల కి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త ఎరువుల అమ్మకాల యాప్ ఖీూా మీద శిక్షణ కార్యక్రమం ఇవ్వటం జరిగింది. ఇందులో డీలర్స్ కి రైతులు కి మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు కి ఈ కొత్త యాప్ మీద శిక్షణ ఇవ్వటం జరిగింది. తెలంగాణ లో ఈ ఫFSS యాప్ ని మేడ్చల్ మల్కాజ్గిరి మరియు రంగారెడ్డి జిల్లా లో అమలు అవుతుంది అనీ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులు అందరూ ఈ కొత్త యాప్ ద్వారా నే అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేయాలి అని వివరించారు. ఇందులో శామీర్పేట్ వ్యవసాయ అధికారి రమేశ్, దుండిగల్ వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్ వ్యవసాయ అధికారి సాయి రమేష్ మరియు, ఉప్పల్ వ్యవసాయ ఆధికారి కృపాకర్ రెడ్డి మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

# తెలంగాణ లో నిరసనలకు సిద్ధం అంటున్న కాంట్రాక్టర్లు

**హైద్రాబాద్ జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**





BAI : తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించిన బకాయి బిల్లుల పెండింగ్ బిల్స్ (Pending Bills) విడుదల ఆలస్యం కావడంపై కాంట్రాక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు రావలసిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ఈనెల 18వ తేదీలోగా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే, 'నో పే -- నో వర్క్' (No Pay -- No Work) అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న అన్ని ప్రభుత్వ నిర్మాణ పనులను, ప్రాజెక్టులను నిలిపివేస్తామని అసోసియేషన్ తీవ్రంగా హెచ్చరించింది. దాదాపు నాలుగేళ్లుగా నిధులు రాకపోవడంతో ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాంట్రాక్టర్లు ఈసారి ప్రభుత్వంతో తేల్చుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రూ.20 వేల కోట్ల పెండింగ్ బిల్లులు రాష్ట్రంలో గత 2022 సంవత్సరం నుంచి దాదాపు రూ. 20,000 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల వందలాది నిర్మాణ సంస్థలు దివాళా తీసి మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆవేదన వ్యక్తం చేసింది. బ్యాంకుల నుంచి తెచ్చిన రుణాలకు వడ్డీలు చెల్లించలేక, ఇటు కార్మికులకు జీతాలు ఇవ్వలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. బకాయిల విడుదలపై ఇప్పటికైనా ప్రభుత్వం ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలోనే తమ ప్రధాన డిమాండ్లతో కూడిన ఒక సమగ్ర వినతిపత్రాన్ని (Memorandum) ఈనెల 15వ తేదీన ప్రభుత్వానికి సమర్పించి, గడువు ముగిసేలోగా సమస్యను పరిష్కరించాలని కోరనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.



# మంగంపల్లి ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి





### ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయి.. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

### ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దమందడి మండలం మంగంపల్లిలో ప్రత్యేక గ్రామసభ నిర్వహణ

**వనపర్తి జిల్లా జూన్ 4 నేటి వెలుగు ప్రతినిధి**

పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తన సొంత గ్రామమైన మంగంపల్లిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. మంగంపల్లి గ్రామంలో ఒక్క పూరిగుడిస కూడా లేకుండా అన్ని పక్క ఇండ్లే ఉండే విధంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలతో పాటు సిసి రోడ్లు డ్రైనేజీలను కూడా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేయడం కోసం తన వంతుగా రూ. 10 లక్షలు కేటాయిస్తానని, జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ.10 లక్షలు తెప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేడు నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంగంపల్లి గ్రామ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులందరూ ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతలు తీసుకుంటామని తెలియజేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మంచి నిర్ణయం తీసుకున్న గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మంచి ఫలితాలు వచ్చాయని కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు, ప్రజలు, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**